http://www.agnidharanews.com
అగ్నిధార

# ఆదర్శం వారి ఆలోచన

**డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని తిరిగి అప్పగించిన దంపతుల ను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మార్చి 30:**

పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి పట్టణానికి చెందిన వరహాగిరి శైలజ, వెంకటరావు దంపతులు సోమవారం కలెక్టరేట్ లో, ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్ రూమ్( చందపల్లి )గృహాన్ని పెద్ద మనసు చేసుకొని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా శైలజ, వెంకటరావు జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ

తమ పిల్లలు సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డారని. తమకు ప్రజా సంక్షేమ పథకంలో మంజూరు అయిన ఈ గృహం అవసరం లేదని , మాకు కేటాయించబడిన గృహాన్ని మరొక అర్హత కలిగిన నిరుపేద కుటుంబానికి కేటాయించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం దృష్టి కేటాయించబడిన ప్రభుత్వ ఆస్తిని పెద్ద మనసుతో మళ్లీ ప్రభుత్వానికే తిరిగి ఇచ్చిన శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులు సమాజంలో గొప్పవారీగా నిలుస్తారని అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా



ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని తన కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పాల్గొన్నారు.

# క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపుల నిబంధన రద్దు చేయాలి





లారీ యజమానుల రాస్తారోకో

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

రవాణా వాహనాలకు తప్పనిసరి చేసిన క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపుల నిబంధనను రద్దు చేయాలని, వాహన ఫిట్నెస్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షులు బారీ, రామగుండం ఏరియా లైన్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రవాణా రంగంపై ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం వాహనాలకు క్యూఆర్ కోడ్ కలిగిన రిఫ్లెక్టివ్ టేపులు, రేర్ మార్కింగ్ ప్లేట్లు తప్పనిసరి చేయడంతో లారీ యజమానులపై అదనపు భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్ ధరలు, విడిభాగాల ఖర్చులు, పన్నులు, టోల్ చార్జీలు, ఫిట్నెస్ ఫీజులు పెరిగిన నేపథ్యంలో కొత్త నిబంధనలు మరింత ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తున్నాయని అన్నారు. ఈ టేపుల అమలులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, యజమానులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. రాస్తారోకో చేస్తున్న లారీ యజమానులతో ట్రాఫిక్ సీఐ అనిల్, ఎస్ఐ మల్లేష్ చర్చించి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం లారీ యజమానులు ఎంవీఐ స్వప్న, ఏఎంవీఐ వంశీకృష్ణలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి ఆరిఫ్ అలీ, బాలాజీ, ఖాజోద్దీన్, మేకల సదానందం, మాదాసు చంద్రయ్య, మేకల నరసయ్య, సత్తయ్య, ఐలయ్య, బుర్కా సతీష్, డి. శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు కార్మిక కోడ్‌ల ప్రతుల దహనం

**తెలంగాణలో అమలు చేయొద్దని డిమాండ్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్టీపీసీ కేంద్రం వద్ద కార్మిక కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టియుసిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు కార్మిక కోడ్‌లు తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని విమర్శించారు. ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని చూస్తున్న ఈ కోడ్‌లను తెలంగాణలో అమలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పారిశ్రామిక సంబంధాల కోడ్, వేతన కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత--ఆరోగ్యం--పని పరిస్థితుల కోడ్ కార్మికులకు నష్టదాయకమని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఏర్పాటు హక్కులు తగ్గే ప్రమాదం ఉందని, పనిగంటలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను రాత్రి వేళల్లో పని చేయించాల్సి రావడం




వల్ల వారి భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశముందని తెలిపారు. కార్మిక సంఘాల వ్యతిరేకతను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం కోడ్‌ల అమలుకు ముందుకు సాగుతోందని విమర్శించారు. 2020లో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కొత్త కోడ్‌లు తీసుకురావడాన్ని దేశవ్యాప్తంగా కార్మికులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి చంద్రయ్య, జిల్లా ఖజాంచీ ఇనుగాల రాజేశ్వర్, మార్త రాములు, సారంగపాణి నరసయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింపు

**ఒకే సంస్థలో ఒకే నియమావళి అమలు చేయాలని డిమాండ్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** రామగుండం మండల కార్యాలయం ఎదుట విద్యుత్ శాఖకు చెందిన ఆర్టిజన్ కార్మికులు సోమవారం రెండో రోజు కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందని కార్మికులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు విద్యుత్ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రస్తుతం అమలులో ఉన్న స్థిర ఉత్తర్వుల వల్ల వారికి తగిన ఉద్యోగ భద్రత, పదోన్నతి అవకాశాలు లభించడం లేదన్నారు. ఒకే సంస్థలో పని చేస్తున్నప్పటికీ వేర్వేరు నిబంధనలు అమలవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్హతల ఆధారంగా హోదా మార్పు కల్పించాలని, విద్యుత్ బోర్డు సేవా నియమావళిని అందరికీ సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఒకే విధమైన పనిని నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు, నిబంధనల్లో అసమానతలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికే పలుమార్లు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లకు వినతిపత్రాలు




అందజేసినప్పటికీ సమస్యల పరిష్కారంలో పురోగతి లేదని కార్మిక నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి చర్చలు జరపకపోతే, ఏప్రిల్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, మల్లారపు ప్రభాకర్, మల్లన్న, సదానందం, బోరే శ్రీనివాస్, జనార్ధన్, అశోక్, వేణుగోపాల్, కృష్ణ, ఎల్. శ్రీకృష్ణ, జ్యోతి, వేణుగోపాల చారి, రవీందర్, రవికుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలో వెలుగులు నింపే కార్మికుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఖని స్వర్ణకారునికి జాతీయ పురస్కారం

**అగ్నిధార గోదావరిఖని టౌన్ మార్చి 30**




గోదావరిఖనికి చెందిన స్వర్ణకారుడు తిప్పర్తి శ్రీనివాస్ వృత్తిలో నైపుణ్య ప్రదర్శన చేపట్టినందుకుగాను జాతీయ పురస్కారం పొందినట్లు ఆయన వెల్లడించారు. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహితీ వేదికలో భాగంగా తెలుగు వెలుగు జాతీయ ఉగాది సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం కరీంనగర్ ఫిలిం భవన్ లో ఆదివారం నిర్వహించారు. ఈ జాతీయ పురస్కారాల అవార్డు ప్రధానోత్సవంలో గోదావరిఖని స్వర్ణకారుడు తిప్పర్తి శ్రీనివాస్ ఆభరణాల తయారీ, రాళ్ల ఫిటింగ్, కటింగ్ తన వృత్తి నైపుణ్యంలో విశేష ప్రతిభ కనబరిచి పలువురి మన్ననలు అందుకున్నందుకు గాను జాతీయ పురస్కారం లభించినట్లు వెల్లడించారు. శ్రీనివాస్ కి జాతీయ పురస్కారాన్ని జాతీయ యూత్ అధ్యక్షులు తెలుగు వెలుగు సాహితీ వేదిక బ్రహ్మశ్రీ అద్దంకి నాగరాజు, అక్కపల్లి యాదగిరి గౌడ్, విశ్వ కళా రత్న పోలోజు రాజ్ కుమార్ చార్యులు, బూట్ల రాజమల్లయ్య లు శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను ప్రధానం చేశారు.

# మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

పెద్దపల్లి జిల్లా కేంద్రం మరియు మండలాల్లో మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్, మున్నూరుకాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరి తర్వాత మొక్కజొన్న రెండో ప్రధాన పంటగా సాగవుతోందని తెలిపారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 95,900 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, దాదాపు మూడు లక్షల టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో 18,851 ఎకరాలు, కరీంనగర్‌లో 30,242, జగిత్యాలలో 42,500, రాజన్న సిరిసిల్లలో 4,308 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోందని వివరించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఒక్క చొప్పదండిలో మాత్రమే కొనుగోలు కేంద్రం ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రత్యేకంగా పెద్దపల్లి జిల్లాలో కేంద్రం ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి మండలాల్లో తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోమటిపల్లి రాజేందర్, జాగీలపు నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

## కళావేదిక డైమండ్ జూబ్లీ పోస్టర్ ఆవిష్కరణ




**డా. ఎంపీ మల్లు రవి చేతుల మీదుగా కార్యక్రమం**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

జూబ్లీహిల్స్‌లో ఆదివారం కళావేదిక డైమండ్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను డా. ఎంపీ మల్లు రవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కళావేదిక సంస్థ 60 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని డైమండ్ జూబ్లీ జరుపుకుంటోందని తెలిపారు. అలాగే 'అభినందన' కార్యక్రమం 40వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.డైమండ్ జూబ్లీ వేడుకలు ఏప్రిల్ 22న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన కళాకారులను సత్కరించడం, సాంస్కృతిక మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయని పేర్కొన్నారు.కళాభిమానులు, కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కళావేదిక ద్వారా కళలకు ప్రోత్సాహం అందిస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని భువన రాయవరపు, ఎడిటర్, కళావేదిక మ్యాగజైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు

## శివాజీ యువసేన.. ఆధ్వర్యంలో...
## రొంపికుంటలో చలివేంద్రం..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్,**

కమాన్ పూర్ మండలంలోని రొంపికుంట గ్రామంలో సోమవారం శివాజీ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, తాజా మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ కటకం రవీందర్, వార్డ్ సభ్యులు, శివాజీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



